330)గౌళ

ప|| ఆతురబందుగుడవు హరినారాయణ కృష్ణ | మాతలపెఱిగి నీవే మన్నించితి విపుడు ||

చ|| గురుకుమారుల దెచ్చికొని రక్షించినయట్లు | ధరలో గజరాజు నుద్ధరించినట్లు |
గరిమ జెరలుమాన్పి కాంతల బెండ్లాడినట్లు | సిరులతో మము దెచ్చి సేవలు గైకొటివి ||

చ|| నేరుపుననే రుకుమిణిదేవి దెచ్చినయట్లు | ధీరత మునిపుత్రుల దెచ్చినయట్లు |
భారమైనయహల్యశాపము మానిపినయట్లు | గారవించి మము నేడు కరుణ జూచితివి ||

చ|| లంక సాధించి సీతను లలి జేకొనినయట్లు | తెంకికి ననిరుద్ధుని దెచ్చినయట్లు |
అంకెల శ్రీవేంకటేశ అట్టె నీదాసులమని | పొంకముగ మాపాలిట బొసగి యేలితివి ||